# ప్రయాణం

శాంతకు స్మృతి తెలిసింది.

"నేనెవరు ? ఎక్కడున్నాను?" అని ఆమె ఆశ్చర్య పడ్డది. ఆమెకు స్పృహ క్రమంగా రాసాగింది.

అవును. తను శాంత. వట్టి అభాగ్యురాలు! తన అభాగ్యం ఆమెనిప్పుడెంత మాత్రమూ బాధించటంలేదు. ఆ తల్లిదండ్రులు! ఆదారిద్ర్యం! అదంతా ఇప్పుడు తనకు చాలా దూరమైనట్టుగాఉంది...ఆభర్త! సుఖం పేరిట అతని వల్ల తను పడినహింస! ఏటేటా కానుపులూ, పిల్లలు బతక్కపోవటమూ! ఇరవైరెండేళ్లునిండక పూర్వమే ఏడు కానుపులూ, వార్ధక్యమూ, వైధవ్యమూనూ! ఏడుగురు పిల్లలు—ఒకరైనా దక్కలేదు. వారంతా తనను ముసలి దాన్ని చెయ్యటానికి, తన కాంతీ యవ్వనమూ హరించటానికి పుట్టి ఉంటారు! తనవయస్సు వాళ్ళకింకా యవ్వనాంకురాలైనా వదలలేదు. తన ఈడువాడే విశ్వం-

ఇంకా స్త్రీ మోహమైనా ఎరగడు. వాడికి, పాపం, చిన్నతనంనించీ తనంటే అంత ప్రేమ! తనవంక వాడు జాలిగా చూస్తుంటే పాతివ్రత్యం తుచ్ఛమైనది అనిపించేది. తను ఒక్కరవ్వ ప్రోత్సాహం ఇస్తే చాలు తనదగ్గిరికి ఉరకటానికి సిద్ధంగా ఉండేవాడు. కాని ఎట్లా? తనను నగ్నంగా చూసివాడి గుండెపగలదా, పాపం! తనుసాహసించ లేకపోయింది—విశ్వానికి ఈమాత్రమైనా ప్రోత్సాహం ఇవ్వలేక పోయింది!...

భర్తతో కాపరం చెయ్యటంలో ఎంత ఆనందం ఉన్నదనుకున్నది తను! తీరా అనుభవించ వచ్చేటప్పటికి తను ఊహించుకుంటున్న ఆనందంలో శతాంశం—సహస్రాంశం లేకపోయింది! తను భర్తకు ఎంత ఆనందం ఇవ్వాలనుకుందో, తను భర్తవల్ల ఎంత ఆనందం పొందాలని ఆశించిందో తనభర్త కలలోనైనా ఊహించాడా ? ఆదురదృష్టవంతుడు తన భార్య ఇవ్వదలుచుకున్న ఆనందంకోసం ఎన్నడన్నా ఆగాడా? బావిలో నీళ్ళుతోడుకున్నట్టు భార్యవల్ల తనకు తను తీసుకోగలిగిన ఆనందమేమిటో తీసుకుని భార్యను గురించిన ఆలోచనే లేకుండా ఆ ఎనిమిది సంవత్సరాలూ వెళ్ళబుచ్చి తనదారిన తను దాటిపోయినాడు. అతనికీ తనకూ ఏవిధమైన సంబంధమూ ఉన్నట్టుగా లేదిప్పుడు ! ఏంభర్త ? అతని వల్ల తనకు ఒక్కసారి పరిపూర్ణమైన పారవశ్యం, నఖశిఖ పర్యంతమూ ఒక్క పులకరింత—!...

అంతకంటె విశ్వం ఒక్కసారి తనకళ్ళలోకి చూస్తే గుండెను ఎవరోగట్టిగా అదిమిపెట్టినట్టుగా అయి ఊపిరి

సలిపేది కాదు, నఖశిఖపర్యంతమూ జలదరించేది! ఏమిటీ విధివైరం? విశ్వంవంక తను ఒక్కసారి ప్రేమగా చూడటానికి, అతనితో ప్రేమ పూర్వకంగా ఒక్కమాట మాట్లాడటానికి, అతన్ని ఒక్కసారి గాఢంగా ఆలింగనం చేసుకోవటానికి తను ఎందుకు నోచుకోలేదు? తను అంత మహాపాతకం ఏంచేసింది?...

అవును, అన్నట్టు తనకు జబ్బుచేసింది. ఎప్పుడో కలలో జరిగినట్టుంది. ఆజబ్బేమయిందీ ? అది నయం అయినట్టు తనకు జ్ఞాపకంలేదే! తనకు స్పృహ తెలియకుండా పోవటమూ, ఎవరో సన్నిపాతం అనటమూ, తన నుదుటిమీద ఉడుకులాం పట్టీలు వెయ్యటమూ, ఇంజక్షన్లు ఇవ్వటమూ, అప్పుడప్పుడూ తనకు ఒళ్లు తెలిసి కళ్లు తెరిచినప్పుడు ఎవరో ఒకరి మొహం దగ్గిరిగా కనిపించటమూ, ఎట్లావుందనో, "నన్ను గుర్తుపట్టగలవా? నేనెవరు ?" అనో అడగటమూ, ఇవితప్ప ఇంకేమీ జ్ఞాపకం రావటంలేదు...తరవాత ? తరవాత ? ...

తనింకా ఆజబ్బులోనేఉందా? ఉంటే తనకింత బాగా స్పృహ ఎట్లా తెలిసిందీ ? తనకు నీరసంగాగాని జబ్బుగా వున్నట్టుగాని లేదేం ? ...తనరోగం నయమయిందేమో! తన మంచంచుట్టూ జనంలేరేమో ! అబ్బ, ఆజనంతో తలపట్టిపోయింది. వారంతా దేనికి ? తన జీవితానికి చీమ తలకాయంత సుఖం చేకూర్చలేని వ్యర్థులు ! ...

శాంత కళ్లు తెరచిచూచి ఆశ్చర్యపడ్డది. అంతా అక్కడే ఉన్నారు. ఒకరూ తనకేసి చూస్తున్నట్టులేదు. అంతా

…స్తున్నారు. మందమతులు. తనకు స్పృహవచ్చిన సంగతి వారికింకా తెలియలేదల్లేఉంది. ఎంతమందిజనం! …ంములో అనేక మొహాలు తనకు తెలిసినవిగా కూడా లేవు. వాటిని జ్ఞాపకం తెచ్చుకునే ఓపికకూడా ఆమెకు లేదు.

"ఏడవనీ! నాకు స్పృహవచ్చిన సంగతి వాళ్ళతో చెప్పకపోతేనేం?" అనుకుంది శాంత.

కాని ఎవరో తనకు స్మృతి తెలియటం గమనించారు. ఆయన తన దగ్గిరికివస్తున్నాడు. ఎంత కళగల మనిషి!

"పోదాంపద, తల్లీ!" అంటున్నాడాయన.

"ఎక్కడికి?" అన్నదిశాంత. కాని ఎక్కడికో ఆమెకర్థం అయింది. చిత్రం! తనకు ఏమాత్రమూ భయం కలగటం లేదు.

"నీకింకా ఇక్కడ ఏంకోరిక ఉందమ్మా?" అంటున్నాడాయన.

తనునవ్వి, "నాకిక్కడ ఏంకోరికతీరింది? నేను దారిద్ర్యంలోనూ దుఃఖంలోనూ జీవించాను. ఐశ్వర్యంకోసం జీవించిఉండటానికి నాకింకా కోరికఉంది నావిశ్వంకోసం బతికిఉండాలనిఉంది. అతని విషయంలో నాధర్మం నేను నిర్వర్తించలేదు. మీకేమీ అభ్యంతరం లేకపోతే నన్నింకా కొంతకాలం జీవించనివ్వండి, నిజమైన ఐశ్వర్యమూ నిజమైనసుఖమూ అనుభవించనివ్వండి. ఈ కొద్దిపాటి అనుగ్రహించలేరా?" అన్నది.

ఆయన తనతలమీద చెయ్యిపెట్టి నిమురుతూ "పిచ్చి తల్లీ!" అన్నాడు ఆయన స్పర్శవల్లా ఆయన మాటల

వల్లా బరువెక్కి ఉన్న తనమనస్సు ఒక్కసారిగా తేలిక అయి దేవత్వం సిద్ధించినట్లయింది.

"దారిద్ర్యంలో ఉండి కూడా ఐశ్వర్యసుఖాన్ని నువ్వు మానసికంగా పొందావు. ప్రపంచంలో వున్న ఐశ్వర్యమంతా నీకిచ్చినా నువ్వు అదివరకు పొందినదానికంటె ఒక్కరవ్వయినా అధికసౌఖ్యం పొందలేవు. నీవిశ్వాన్ని ఎంత ప్రేమించాలో అంతా అదివరకే ప్రేమించావు. అతని వల్ల ఎంతసుఖం పొందాలో అంతా పొందావు. నీకు వెయ్యిసంవత్సరాల ఆయుర్దాయం ఇచ్చి అతన్ని నీకిచ్చినా నీవు పొందగలిగే కొత్తసుఖం ఏమీ లేదు.

"నీకింకేం మిగిలి ఉంది ? నీవిశ్వం నీభర్తకంటె ఏమంత భిన్నమైన మనిషి కాడు. నీకు నేను మరికొంత ఆయుర్దాయమూ, ఐశ్వర్యమూ విశ్వాన్నీ ఇచ్చినట్లయితే నీకు జీవితంలో ఎన్నడూ ఎరగనంత ఆశాభంగం కలుగుతుంది. తల్లీ! పోదాంపద !" అన్నాడాయన మెత్తని కంఠంతో.

ఆయనమాటలు తనకు ఎంతసత్యంగా వినిపించినయ్యంటే అవి ఆయనగొంతునుంచి కాక తన అంతరాత్మలోనించే వస్తున్నయ్యా అనిపించింది.

"వస్తున్నాను, పదండి !" అన్నది శాంత.